క్లుప్తంగా

ధాన్యం చోరీపై విచారణ



నర్సాపురం ధాన్యం కొనుగోలు కేంద్రంలో విచారణ చేపడుతున్న తహసీల్దార్

రాజాపేట : మండలంలోని నర్సాపురం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతు నెమిల శ్రీహరికి చెందిన ధాన్యం రాశి నుంచి చోరీకి గురైన ధాన్యంపై శనివారం తహసీల్దార్ అనిత విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా పోలీస్, రెవెన్యూ సిబ్బందితో కలిసి కొనుగోలు కేంద్రంలో రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిందితులను గుర్తించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆమె వెంట ఏఎస్ఐ యాదయ్య తదితరులు ఉన్నారు.

అందాల పోటీలను నిలిపివేయాలి



నిరసన తెలుపుతున్న శివసేన నాయకులు

భువనగిరి : పాకిస్తాన్- భారత్ దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ అందాల పోటీలను నిలిపివేయాలని శివసేన పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పూస శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు శివ, శేఖర్, హరికాంత్, మధు, రతన్‌లాల్, సత్తిగౌడ్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

తుర్కపల్లి : మండలంలోని వెంకటాపురం గ్రామంలో గల వేంకటగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు నేటి (ఆదివారం) నుంచి ప్రారంభంకానున్నాయి. మూడు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు రమాకాంత్ శర్మ శనివారం వెల్లడించారు. 11న అభిషేకం, ధ్వజస్తంభ పూజ, గణపతి, నవగ్రహ, సుదర్శన హోమం చేపట్టనున్నారు. 12న ముఖ్య ఘట్టమైన లక్ష్మీనర్సింహస్వామి, తిరుకల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ బ్రహ్మోత్సవాల సందర్భంగా సంప్రదాయం ప్రకారం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం తరుపున ఆలయ చైర్మన్ నర్సింహామూర్తి, ఈఓ వెంకటరావు, స్వామివారికి పట్టువస్త్రాలు, అమ్మవారికి ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

అడ్డగూడూర్ : మండలంలోని రేపాక, వెల్దేవి, మానాయికుంట, కంచనపల్లి గ్రామాల్లోన్ని ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ శేషగిరిరావు శనివారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. అదే విధంగా మండలంలోని శ్రీసాయి శ్రీనివాస రైస్‌మిల్‌ను సందర్శించి కొనుగోళ్లు, దిగుమతులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓ నవనీత, రెవెన్యూ అధికారులు, నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు మేలు



చెక్కులు అందజేస్తున్న యాస లక్ష్మారెడ్డి

ఆత్మకూరు(ఎం) : సీఎం రిలీఫ్ ఫండ్‌తో నిరుపేదలకు మేలు జరుగుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని 18మందికి లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం స్థానిక ఆయన అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సహకారంతో మన మండలానికి అత్యధికంగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు వస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ జన్నాయికోడె నగేష్, నాయకులు సామ శ్రీనువాసరెడ్డి, ముద్దసాని సిద్దులు, పరకాల అంజయ్య, మురారిశెట్టి రాజు, చిత్తార్ల అనిల్, రాజు పాల్గొన్నారు.

నేడు కునపురి రాములు వర్ధంతి

వలిగొండ : మండలంలోని దాసిరెడ్డిగూడెం గ్రామంలో మాజీ మావోయిస్టు, బీఆర్ఎస్ నాయకుడు కునపూరి రాములు 11వ వర్ధంతిని నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు శనివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ క్యామ మల్లేశం, పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, దూదిమెట్ల బాలరాజు యాదవ్, పార్టీ నాయకుడు చెరుకు సుధాకర్ తదితరులు పాల్గొంటున్నారని తెలిపారు.

అధ్వానంగా గ్రామీణ రహదారులు

- కంకర తేలి గుంతలమయంగా మారిన ముశిపట్ల–దత్తప్పగూడెం రోడ్డు
- ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోక ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



అధ్వానంగా మారిన ముశిపట్ల - దత్తప్పగూడెం రోడ్డు

మోత్కూరు : మండలంలోని గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. కొన్ని ఏళ్ల క్రితం నిర్మించిన బీటీ, కంకర రోడ్లకు నేటి వరకు మరమ్మతులకు నోచుకోకపోవడంతో అవి గుంతలమయంగా మారి ఆయా గ్రామాలకు వెళ్లే ప్రజలు, ప్రయాణికులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా మండలంలోని ముశిపట్ల–దత్తప్పగూడెం రోడ్డు కంకర తేలి గుంతలమయంగా మారి తారు రోడ్డు రూపం లేకుండా పోయింది. మోత్కూరు మున్సిపల్ కేంద్రం నుంచి ఆరెగూడెం, ముశిపట్ల మీదుగా దత్తప్పగూడెం వరకు దశాబ్దాల క్రితం సుమారు రూ.కోటి వ్యయంతో బీటీ రోడ్డు వేశారు. ఈ మార్గం నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. రోడ్డు నిర్మాణం జరిగినప్పటి నుంచి ముశిపట్ల, దత్తప్పగూడెం రోడ్డు ఏనాడు మరమ్మతులకు నోచుకోలేదు. మోత్కూరు నుంచి ఆరెగూడెం, ముశిపట్ల వరకు పూర్తిగా బీటీరోడ్డు దెబ్బతిన్నది. బీటీరోడ్లు మరమ్మతులకు నోచుకోకపోవడంతో కంకర రోడ్డును తలపిస్తున్నాయి. ద్విచక్ర వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో కంకర తేలి లోతైన గుంతలతో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దత్తప్పగూడెం ప్రజలు అనాజీపురం మీదుగా మోత్కూరుకు వెళ్లడంతో 12కి.మీ. వస్తుంది. ముశిపట్ల మీదుగా మోత్కూరుకు వెళితే దత్తప్పగూడెం ప్రజలకు 8కి.మీ. దూరం మాత్రమే వస్తుంది. ఈ రోడ్డు దెబ్బ తినడంతో చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుందని దత్తప్పగూడెం గ్రామ ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి దెబ్బతిన్న ముశిపట్ల–దత్తప్పగూడెం బీటీ రోడ్డు మరమ్మతులు చేయించి ఆయా గ్రామాల ప్రజల, ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

ఏళ్లుగా మరమ్మతులు మరిచారు



గ్రామీణ రోడ్ల మరమ్మతులను ప్రభుత్వాలు మరిచాయి. రోడ్డు వేసిన కొంత కాలం అగ్రిమెంట్ ప్రకారం కాంట్రాక్టర్ మరమ్మతులు చేయించాలనే నిబంధనలు పట్టించుకోవడం లేదు. గ్రామీణ రహదారులపై పాలకులు చిన్నచూపు చూస్తున్నారు. ముశిపట్ల, దత్తప్పగూడెం రోడ్డు ధ్వంసమై ఏళ్ల గడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయించాలి.

– గుంటి సతీష్, దత్తప్పగూడెం

ప్రయాణించాలంటే ఇబ్బందులు పడుతున్నాం



గుంతలమయమైన ముశిపట్ల–దత్తప్పగూడెం రోడ్డులో ప్రయాణం సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వాహనదారులు ప్రమాదాల బారిన పడక ముందే రోడ్డుకు మరమ్మతులు చేయించాలి. అదే విధంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించాలి. గ్రామీణ రహదారులపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి.

– సోలిపురం చెన్నారెడ్డి, రైతు, ముశిపట్ల

మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం

ముశిపట్ల – దత్తప్పగూడెం బీటీరోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది వాస్తవమే. అధ్వానంగా ఉన్న ఈ రోడ్డును గుర్తించాము. బీటీ రెన్యువల్ చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాము. నిధులు మంజూరు కాగానే రోడ్డు మరమ్మతులు చేయిస్తాం.

– మంగూలాల్ డీఈఈ, పంచాయతీరాజ్ శాఖ, మోత్కూరు

గిరిజనుల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



తుర్కపల్లి : బీటీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

తుర్కపల్లి : గిరిజనుల సమగ్రాభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని ధర్మారం, కర్షల్‌గడ్డ నుంచి బిల్యానాయక్ తండా వరకు రూ.2కోట్ల 50లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గిరిజన ప్రాంత వాసులు ఎన్నో రోజుల నుంచి ఇబ్బందులు పడుతుండడంతో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఐనాల చైతన్య మహేందర్‌రెడ్డి, నాయకులు ధనావత్ శంకర్ నాయక్, చాడ భాస్కర్‌రెడ్డి, మోహన్‌బాబు, పట్టు నాయక్, నిఖిల్‌గౌడ్, భాస్కర్‌నాయక్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మండలంలోని నాగాయిపల్లితండాకు చెందిన ధరావత్ రామ్‌కోటి తండ్రి గుండెపోటుతో మృతి చెందడంతో అతడి కుటుంబానికి, గోపాలపురం గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన భూసం మల్లయ్య కుటుంబాన్ని శనివారం ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు చైర్‌పర్సన్ ఐనాల చైతన్య మహేందర్‌రెడ్డి, శంకర్‌నాయక్, భాస్కర్‌రెడ్డి, నిఖిల్‌గౌడ్, కృష్ణ, రాధాకృష్ణ, శ్రావణ, జహంగీర్, నరసింహ పాల్గొన్నారు.

సైనికులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

యాదగిరిగుట్ట : పాకిస్తాన్‌తో యుద్ధంలో పాల్గొన్న సైనికులకు, వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. శనివారం పట్టణంలో నియోజకవర్గంలోని ఆయా మండలాల లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను ఆయన అందజేసి మాట్లాడారు. భారత ఆర్మీ చేస్తున్న పోరాటానికి తన కుమారుడు బీర్ల శివమణి తన కిడ్డీ బ్యాంక్‌లో దాచుకున్న రూ.లక్షతో పాటు బీర్ల ఫౌండేషన్ నుంచి, తన ఎమ్మెల్యే జీతం నుంచి రక్షణ శాఖకు అందిస్తామని, ఆ నగదును కలెక్టర్ ద్వారా సోమవారం పంపిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఐనాల చైతన్యరెడ్డి, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, మండల అధ్యక్షుడు కానుగు బాలరాజుగౌడ్, పట్టణ అధ్యక్షుడు భిక్షపతిగౌడ్, నాయకులు దుంబాల వెంకట్‌రెడ్డి, శిఖ ఉపేందర్, గుండ్లపల్లి భరత్, హేమేందర్‌గౌడ్ తదితరులున్నారు.

విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు

యాదగిరిగుట్ట : మండల పరిధిలో 6వతరగతి నుంచి 9వతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంఈఓ శరత్ యామిని శనివారం తెలిపారు. ఈ నెల 15నుంచి 15రోజుల పాటు యోగా, స్పోకెన్ ఇంగ్లిష్, లైఫ్ స్కిల్స్, ఇండోర్ గేమ్స్ (క్యారమ్, చెస్), డ్రాయింగ్ వంటి అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. శిక్షణకు పేర్లు నమోదు చేసుకోవడానికి యాదగిరిగుట్ట ఎంపీపీఎస్‌లో, దాతారుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో, మల్లాపురం జెడ్పీ పాఠశాలలో, యాదగిరిపల్లి పోచమ్మవాడ పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

గుండాల : మండలంలోని వెల్మజాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 6నుంచి 9వతరగతి చదువుతున్న విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ మన్నె అగ్గిరాములు శనివారం తెలిపారు. ఈ నెల 15నుంచి 31వతేదీ వరకు శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు క్యారమ్, చెస్, స్పోకెన్ ఇంగ్లిష్, యోగా, చిత్రలేఖనం, కమ్యూనికేషన్ స్కిల్స్‌లలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఆయా పాఠశాలల హెచ్ఎంలను సంప్రదించాలని కోరారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

భూదాన్‌పోచంపల్లి : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 20న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ మంచాల మధు అన్నారు. శనివారం పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం తీసుకొచ్చిన కొత్త లేబర్ చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో దుబ్బాక జగన్, వడ్డేపల్లి యాదగిరి, కృష్ణ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ చైర్మన్, వైస్‌చైర్మన్‌కు సన్మానం

చౌటుప్పల్ : పట్టణంలో చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, పలువురు డైరెక్టర్లను శనివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో బోయ లింగస్వామి, శ్రావణ్, యాదయ్య, శ్రీనాథ్, రాము, సాయిలు, భీమయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఈతకు ఒంటరిగా పంపొద్దు

రామన్నపేట : పిల్లలను ఎట్టి పరిస్థితుల్లో ఒంటరిగా ఈతకు పంపొద్దని ఎస్ఐ పి.మల్లయ్య శనివారం కోరారు. ఇటీవల కాలంలో ఈతకోసం వెళ్లిన చిన్నారులు ప్రమాదాలకు గురై చనిపోయిన సంఘటనలు బాధాకరమన్నారు. మన మండలంలో ఇటువంటి సంఘటనలు జరుగకుండా తల్లితండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తీర్మానం



రామన్నపేట : గ్రామసభలో పాల్గొన్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు




ఆలేరురూరల్ : బడిబాటలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

రామన్నపేట : మండలంలోని కొమ్మాయిగూడెం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించడం కోసం శనివారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. గ్రామంలోని బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని గ్రామస్తులు తీర్మానించారు. పాఠశాలల్లోని వసతులను ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎం.మురళీధర్ గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సఫియాబేగం, కోట విజయవెంకన్న, మందడి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాసచారి, గడ్డం శ్రీనివాస్ గ్రామపెద్దలు కూనూరు క్రిష్ణగౌడ్, ఎర్ర కాటమయ్య, మల్లేశం, రవీందర్, నరేష్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

శారాజిపేటలో బడిబాట కార్యక్రమం

ఆలేరురూరల్ : మండలంలోని శారాజిపేట జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం తుప్పరి జ్యోతిరాజ్ ఆధ్వర్యంలో శనివారం గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఇంటింటికి తిరిగి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందిస్తూ, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో పీఈటీ గడసంతల మధుసూదన్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పుట్టల జ్యోతి, గ్రామప్రజలు రచ్చ రామ్‌నర్సయ్య, నసీరుద్దీన్, కృష్ణారావు, రామచందర్, కాంతరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అవార్డుల ప్రదానం అభినందనీయం



అవార్డులు అందుకున్న సేవా నేస్తాలు

మోత్కూరు : వివిధ రంగాల్లో విశేష సేవలు చేస్తున్న వారిని గుర్తించి అవార్డులు ప్రదానం చేయడం అభినందనీయమని ఏరువాక కేంద్రం జిల్లా రిటైర్డ్ శాస్త్రవేత్త ఎ.అనిల్‌కుమార్, ప్రముఖ సిద్ధాంతి స్వర్ణ కంకణం గ్రహీత బేతు సత్యనారాయణ అన్నారు. శనివారం మున్సిపాలిటీలోని ఆర్యవైశ్య భవన్‌లో జరిగిన సేవా నేస్తం ఉగాది పురస్కారాల ప్రధానోత్సవంలోవారు పాల్గొని మాట్లాడారు. మోత్కూరు విజయలక్ష్మి మెమోరియల్ పేరుతో ట్రస్టు ఏర్పాటు చేసి 30మందికి అవార్డులు ప్రదానం చేసి వారిని గౌరవించడం గొప్పవిషయమన్నారు. ట్రస్టు చైర్మన్ మోత్కూరు బ్రహ్మ ఆచార్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురిని అవార్డులతో సత్కరించారు. కార్యక్రమంలో పానుగంటి ప్రద్యుమ్నాచారి, కాసోజు బ్రహ్మాచారి, విఠలాచారి, అవిశెట్టి అవిలుమల్లు, తొగిటి మనోహరాచారి, మొగుళ్లపల్లి సోమయ్య, కలిమెల నర్సయ్య, పోలిసేని ఆనందమ్మ, కోమటి మత్స్యగిరి, స్వామిరాయుడు, ట్రస్టు సభ్యులు శివ, స్వాతి, కవిత, సరిత తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణగిరీశుడికి వసంత సేవ

భువనగిరి: పట్టణ పరిధిలోని స్వర్ణగిరి క్షేత్రంలో గల శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం వసంత సేవ వేడుకను కనుల పండువగా నిర్వహించారు. అంతకుముందు వేకువ జామున సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్రనామార్చన, శ్రీ వెంకటేశ్వరస్వామి నిత్యకళ్యాణం తదితర పూజలు గావించారు. మధ్యాహ్నం 4,500 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం తిరువీధి ఉత్సవ సేవ, జలనారాయణస్వామికి మంగళహారతులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

అమ్మగా, అధికారిగా..

- వనితరసాధ్యురాలిగా నిలుస్తోన్న జిల్లా ఉపాధి కల్పనాధికారి సాహితీ



పాఠశాలకు వెళ్లేందుకు కుమారుడిని రెడీ చేస్తున్న సాహితీ

భువనగిరి : కుటుంబంలో తల్లిగా, భార్యగా ఉంటూ మరో వైపు ఉద్యోగస్తురాలుగా బాధ్యతలు, విధులు నిర్వహించడంలో ఎంతో సంతృప్తిగా ఉందని జిల్లా ఉపాధి కల్పానాధికారి పరాంకుశం సాహితి అంటున్నారు. నేడు మదర్స్ డేను పురస్కరించుకుని సాహితీ చెప్పిన మనోగతం ఆమె మాటల్లోనే.. ప్రస్తుతం భువనగిరిలో నివాసం ఉంటూ జిల్లా ఉపాధి కల్పనాధికారిగా విధులు నిర్వహిస్తున్నాను. భర్త వ్యాపారం చేస్తాడు. ఓ బాబు ఉన్నాడు.. ఉద్యోగ విధుల నిర్వహణ కోసం కార్యాలయానికి వెళ్లడం కోసం ఇంట్లో పనులు త్వరగా ముగించుకోవడానికి ప్రతి రోజు ఉదయం 6గంటలకు లెస్తాను. ఇల్లును శుభ్రం చేసుకుని ఉదయం 7గంటలకు పూజ నిర్వహిస్తాను. అనంతరం బాబును నిద్ర నుంచి లేపి పాఠశాలకు పంపేందుకు తయారు చేయడంతో పాటు మరో వైపు వంటపని చేస్తుంటాను. వంటపని పూర్తికాగానే బాబును పాఠశాల వెళ్లేందుకు సిద్ధం చేసి మధ్యాహ్నానికి లంచ్ బాక్స్‌తో పాటు స్నాక్స్‌ను బ్యాగులో పెట్టి పంపుతాను. అనంతరం సాయంత్రం వచ్చిన తర్వాత మళ్లీ స్నాక్స్ తీసుకోవడం కోసం సిద్ధం చేసి అందుబాటులో ఉంచుతాను. అనంతరం భర్త వ్యాపారం నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్తాడు. దీంతో ఆయనకు కావాల్సిన లంచ్ బాక్స్ సిద్ధం చేస్తాను. అనంతరం తాను ఆఫీస్ వెళ్లేందుకు రెడి అయి లంచ్ బాక్స్‌ను తీసుకుని ఉదయం 10.30 గంటల వరకు ఆఫీస్‌కు వస్తాను. ఇంటికి వెళ్లాగానే రాత్రి డిన్నర్‌కు వంట సిద్ధం చేస్తాను. అలాగే బాబుకు ఇంట్లోనే ఆఫీస్ నుంచి వచ్చిన తర్వాత గంట హోంవర్క్ చేయిస్తాను. ప్రతి శనివారం సాయంత్రం హైదరాబాద్‌లో ఉన్న స్వంత నివాసానికి అందరం వెళ్తాం. ఆదివారం సాయంత్రం తిరిగి భువనగిరికి వస్తుంటాం. ఇలా ఇంట్లో తల్లిగా, భార్యగా, ఉద్యోగస్తురాలుగా విధులు, బాధ్యతలు నిర్వహిస్తున్నాను.

కష్టపడింది.. కల నెరవేరింది..



కుమారుడు వినయ్‌రెడ్డితో తల్లి గుత్తా ప్రేమలత

ఆత్మకూరు(ఎం) : మండలంలోని కూరెల్ల గ్రామానికి చెందిన గుత్తా ప్రేమలతకు నార్కట్‌పల్లి మండలం గోపులాయిపల్లి గ్రామానికి చెందిన గుత్తా రాంరెడ్డితో వివాహం జరిగింది. వారికి వినయ్‌రెడ్డి అనే కుమారుడు ఉన్నాడు. భర్త రాంరెడ్డి అనారోగ్యానికి గురికావడంతో వైద్య ఖర్చులకు రూ.4లక్షల వరకు అప్పు తెచ్చి ఖర్చు చేసింది భార్య ప్రేమలత. అయినా భర్త రాంరెడ్డి దక్కలేదు. అప్పుడు కుమారుడు వినయ్‌రెడ్డి వయస్సు ఏడు సంవత్సరాలు. ఒక వైపు అప్పులు... మరో వైపు భర్త మృతితో ప్రేమలత మానసికంగా కుంగిపోయింది. బాధను తట్టుకుని ఎలాగైనా తన కుమారుడిని ప్రయోజకుడిని చేయాలని కళలు కనింది. భర్త మరణానంతరం తల్లి గారి గ్రామమైన కూరెళ్లకు వచ్చి స్థిరపడింది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ప్రేమలత కుట్టుమిషన్‌ను కుట్టుకుంటూ గ్రామంలో నలుగురికి కుట్టు శిక్షణ ఇస్తూ ఉపాధిని కల్పిస్తూ కుమారుడిని చదివించింది. ప్రస్తుతం కుమారుడు బీటెక్ పూర్తి చేసి ప్రస్తుతం బెంగుళూరులో సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తున్నాడు. కుమారుడు ఉన్నత స్థాయికి ఎదిగినా ప్రేమలత మాత్రం జీవనోపాధిని కల్పించిన కుట్టుమిషన్ మాత్రం మరువలేదు.

బాల సదనానికి చేరిన బాలిక

- ఆత్మహత్యాయత్నంపై అధికారుల విచారణ

భువనగిరిటౌన్ : పాఠశాలలో మేడం తిట్టిందని ఆత్మహత్యకు ప్రయత్నం చేసిన బాలిక శనివారం బాలసదనానికి చేరింది. చౌటుప్పల్ కేజీబీవీలో ఏర్పాటు చేసిన వృత్తి విద్య కోర్సుల వేసవి శిబిరానికి భువనగిరి బాలసదనం నుంచి వెళ్లిన బాలిక శుక్రవారం ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ నేపథ్యంలో బాలికను రాత్రి జిల్లా కేంద్ర ఆసుపత్రికి చికిత్స కోసం తీసుకువచ్చారు. ఆసుపత్రిలో చికిత్స అందించిన అనంతరం డిశ్చార్జి చేయడంతో అధికారులు తిరిగి బాలసదనానికి తరలించారు. బాలిక బీబీనగర్ పట్టణంలోని కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. వేసవి సెలవు కావడంతో ఆమెను బాలసదన్‌కు తీసుకురాగా ప్రత్యేక శిక్షణ శిబిరానికి తరలించారు. అయితే ఆత్మహత్యాయత్నంపై బాలిక కుటుంబ సభ్యులు భువనగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెల్లగా చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వాలని సూచించి వెనక్కి పంపారు. అయితే ఆత్మహత్యా యత్నంపై స్త్రీశిశు సంక్షేమ శాఖ అధికారులు దర్యాప్తు చేపట్టారు. సంబంధిత బాలికతో మాట్లాడి ఆత్మహత్యయత్నానికి గల కారణాలను అడిగి తెలుసుకుని వాంగ్మూలం నమోదు చేశారు. రెండు, మూడు రోజులలో అధికారులకు నివేదిక ఇస్తామని, అప్పటివరకు ఆ బాలిక భువనగిరి బాలసదనంలోనే ఉంటుందని విచారణ అధికారులు తెలిపారు. ఈ ఘటనపై విచారణ జరిపి దోషులపై చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

వీవీ రావు జయంతి



వలిగొండ : పీవీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

వలిగొండ : మండల కేంద్రంలో శనివారం మాల మహానాడు ఆధ్వర్యంలో మాలమహానాడు వ్యవస్థాపకుడే పీవీ రావు 73వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భారత్ పాకిస్తాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధంలో మృతి చెందిన వీరజవాన్ మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు పెరమండ్ల యాదగిరి, మామిండ్ల రత్నయ్య, నీలం నరేందర్, రాపోలు పవన్‌కుమార్, కాశమల్ల శేఖర్, రత్నయ్య, విజయ్‌మార్, సురేష్, భిక్షం పాల్గొన్నారు.

చౌటుప్పల్ : పట్టణంలో మాల మహానాడు వ్యవస్థాపకుడు దివంగత పీవీరావు 73వ జయంతిని శనివారం మాల మహానాడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు జువ్వి నర్సింహ, నర్సింగరావు, రఘుపతి, కట్ట శంకరయ్య, స్వామి, బాలరాజు, శివ, భాస్కర్, హరినాథ్, కుమారస్వామి, సురేష్, మహేష్, యాదయ్య, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్ మురళీనాయక్‌కు ఘన నివాళి

మోత్కూరు : భారత్, పాకిస్తాన్ ఎదురుకాల్పుల్లో దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఆర్మీ జవాన్ మురళీనాయక్‌కు శనివారం మున్సిపల్ కేంద్రంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఆయన మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. దేశం కోసం యుక్త వయస్సులోనే ప్రాణాలు అర్పించి అమరుడైన బడుగు, బలహీన వర్గాలకు చెందిన మురళీనాయక్ కుటుంబానికి రూ.5కోట్ల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు ఆ కుటుంబాన్ని అన్ని విధాలుగా కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిజర్వేషన్ సాధన సమితి జిల్లా నాయకులు కలిమెల నర్సయ్య, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నోముల రమేష్, మండల అధ్యక్షుడు శివార్ల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు నిలిగొండ మత్స్యగిరి, బాబురావు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అనుమానితులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలి



ఆలేరు : సమావేశంలో మాట్లాడుతున్న సీఐ కొండలరావు, వివిధ పార్టీల నాయకులు



రాజాపేట : సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శంకర్‌గౌడ్

ఆలేరు : భారత్–పాకిస్తాన్ మధ్య నెలకొన్న యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో పట్టణంలో, గ్రామాల్లో ఎవరైనా అనుమానితులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని ఆలేరు సీఐ కొండలరావు అన్నారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివిధ వర్గాలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశ సరిహద్దులో ఉద్రిక్తతల దృష్ట్యా జాగ్రత్త అంశాలపై సీఐ వివరించారు. వాట్సాప్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల్లో సున్నిత అంశాలను పోస్టింగ్ చేయొద్దని కోరారు. సమావేశంలో ఎస్ఐ రజికర్, వివిధ పార్టీల నాయకులు, వివిధ వర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అనుమానితులపై అప్రమత్తంగా ఉండాలి

రాజాపేట : అనుమానిత వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలని సీఐ శంకర్‌గౌడ్ అన్నారు. పాకిస్తాన్ భారత్ నిర్వహిస్తున్న ఆపరేషన్ సింధూర్ సందర్భంగా శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో కొత్తగా వచ్చిన వ్యక్తులను గుర్తించి పోలీసులకు సమాచారం అందించాలని, వారి కదలికలను పసిగట్టాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో దేశాన్ని కాని, ఏ మతాన్ని కించపరిచినట్లుగా పోస్టులు పెడితే చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఎస్ఐ అనిల్‌కుమార్, ఆయా మతాల పెద్దలు, పలు పార్టీల నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

యుద్ధం దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి

వలిగొండ : భారత్ పాకిస్తాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ యుగంధర్ అన్నారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని వివిధ గ్రామాల ముఖ్య నాయకులకు, ప్రజలకు ఏర్పాటు చేసిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. యుద్ధం కొనసాగుతున్న వేల సామాజిక మాధ్యమాలలో తప్పుడు ప్రచారాలు చేయవద్దని, ఒకవేళ ఎవరైనా చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. సమావేశంలో తుమ్మల యుగంధర్‌రెడ్డి, బద్దం సంజీవరెడ్డి, కేసరి రాంరెడ్డి, కాసుల కృష్ణ, బోళ్ల సుదర్శన్, యాదగిరి, జగన్‌రెడ్డి, పాండు, ప్రొబెషనరీ ఎస్ఐ శ్రీనివాస్, ముస్లింలు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో పోస్టులపై అవగాహన

భువనగిరిటౌన్ : ఇండో– పాక్ మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకుటున్న నేపథ్యంలో పోలీసులు స్థానిక ప్రజలకు సోషల్ మీడియాలో సున్నిత అంశాల మీద తప్పుడు ప్రచారం చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. సోషల్ మీడియాలో కనిపించే ప్రతిదీ నిజం కాదని వాటిని అధికారికంగా నిర్ధారించుకోవాలని పోలీసులు కోరారు. అసత్యపు పోస్టులను ప్రచారం చేయొద్దని సూచించారు. ఈ మేరకు పోలీస్ శాఖ జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్‌స్టేషన్ పరిధిలో సోషల్ మీడియాలో అవగాహన కల్పిస్తూ పోస్టులు పెడుతున్నారు. నకిలీ కథనాలను ప్రచారం చేసే ఖాతాలను బ్లాక్ చేయాలని సూచించారు.